సాక్షి
వికారాబాద్

గురువారం । 6 । జూన్ । 2024



సమస్యల సంత

పరిగి వారాంతపు సంత సమస్యలకు నిలయంగా మారింది. దీంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 8లో▸



ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

అర్ధరాత్రి రోడ్డు పక్కన ఉన్న ఇంట్లోకి లారీ దూసుకెళ్లిన సంఘటన పరిగి మండలం గడిసింగాపూర్‌లో చోటుచేసుకుంది. 8లో▸



నిత్యం సాహసమే..

యాలాల మండలం పగిడిపల్లి – పటేల్‌చింత తండా గ్రామాల మధ్య ఉన్న అన్నారం వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. 9లో▸

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్‌కు వీవీ ప్యాట్లు



స్ట్రాంగ్ రూం వద్ద కలెక్టర్, ఎస్పీ తదితరులు

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగియడంతో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన వీవీ ప్యాట్లను వికారాబాద్‌లోని తహసీల్దారు కార్యాలయం వద్ద గల స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. బుధవారం కలెక్టర్ నారాయణరెడ్డి.. ఎస్పీ కోటిరెడ్డితో కలిసి స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వాహనాలకు వేలం

ఆమనగల్లు: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఆమనగల్లు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ ఆవరణలో గురువారం వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమనగల్లు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాల్లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేస్తున్నామని.. ఆసక్తి కలిగినవారు వేలంపాటకు హాజరుకావాలని సీఐ కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: న్యాయ పరిపాలనలో శిక్షణ పొందుటకు రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలకు చెందిన అర్హులైన ఎస్సీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వారిచే గుర్తించబడిన ఇన్‌స్టిట్యూషన్స్, సెంట్రల్ యాక్ట్ లేదా ప్రొవిజనల్ యాక్ట్ కింద ఇన్ కార్పొరేషన్ చేయబడిన, స్థాపించబడిన ఏదేని యూనివర్సిటీ నుంచి ఫ్యాకల్టీలో బేసిక్ డిగ్రీ, లా డిగ్రీ పొందినవారు అర్హులన్నారు. 1 జూలై 2024 నాటికి 23 సంవత్సరాలు నిండినవారు, అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2 లక్షలు మించరాదు. అభ్యర్థి గతంలో ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని ఉండరాదు. ఎంపిక చేయబడిన అభ్యర్థులకు న్యాయ పరిపాలనలో 3 సంవత్సరాల వ్యవధికి శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రతీనెల రూ.3 వేలు స్టైఫండ్ ఇస్తారని తెలిపారు. మొదటి సంవత్సరం లా పుస్తకాలు , ఫర్నీచర్ కొనుగోలు చేసే నిమిత్తం రూ.50 వేలు మంజూరు చేస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వచ్చేనెల 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని, ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో జిల్లా సెలక్షన్ కమిటీ కలెక్టరేట్‌లో హాజరుకావాలని తెలిపారు.

సదరం స్లాట్ల విడుదల

ఇబ్రహీంపట్నం రూరల్: సదరం క్యాంపునకు హాజరయ్యే వికలాంగుల కోసం మీసేవలో స్లాట్స్ అందుబాటులో ఉంచనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండాపూర్ జిల్లా ఆస్పత్రి, కొండాపూర్ ఏరియా ఆస్పత్రుల్లో నిర్వహించే ఈ క్యాంపునకు రంగారెడ్డి జిల్లాకు చెందిన వారు మాత్రమే హాజరుకావాలన్నారు. స్లాట్స్ మీ సేవలో బుక్ చేసుకునే సదుపాయం కల్పించామన్నారు. దరఖాస్తుదారులకు క్రమసంఖ్య కేటాయించడంతో పాటు క్యాంపు తేదీ ప్రకారం మొబైల్‌కు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు. మీ సేవలో దరఖాస్తు చేసుకున్న రశీదు, ఇంతకుముందు చూపించుకున్న డాక్టర్, మెడికల్ సర్టిఫికెట్లు ఏవైనా ఉంటే వాటితో పాటు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఫొటో తీసుకొని రావాలని తెలిపారు.

సీఎంను కలిసిన బండ్ల గణేశ్



షాద్‌నగర్: సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసానికి వెళ్లిన బండ్ల గణేశ్ రేవంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. పూల బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నేత తాండ్ర కాశీనాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం పోలీసులు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. సాగర్‌రోడ్డుపై వాహనాలు అతి వేగంగా వెళ్లడం, డ్రైవర్లు లైసెన్సులు లేకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో సీఐ శంకర్‌కుమార్ సాగర్‌రోడ్డుపై ప్రమాదాల నివారణ కోసం వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. అదే విధంగా బక్రీద్ పర్వదినాన్ని సందర్భంగా అక్రమంగా పశువుల తరలింపును సైతం కనిపెట్టేందుకు ఈ తనిఖీలు చేపడుతున్నారు.

భారీగా క్రాస్



చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో భారీగా ఓట్ల బదలాయింపు

- కమలం పార్టీ వైపు మళ్లిన కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓటర్లు
- వికారాబాద్, తాండూరులో 'కారు' డిపాజిట్ గల్లంతు
- సీఎం, స్పీకర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు మెజారిటీ
- అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఇరు పార్టీలకు భారీగా తగ్గిన మద్దతు

వికారాబాద్: బీజేపీ ఒక్కసారిగా తారాజువ్వలా ఆకాశంకేసీ దూసుకుపోయింది. ఇదే సమయంలో కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు భారీగా గండి పడింది. బీఆర్ఎస్ కోటలకు బీటలువారాయి. వెరసి లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌లో ఎలాంటి ఉత్కంఠకు తావులేకుండా బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బంపర్ మెజార్టీతో విజయకేతనం ఎగురవేయగా.. కాంగ్రెస్ నేతలు ఎందుకిలా జరిగిందబ్బా అంటూ లెక్కలు వేసుకునే పనిలో మునిగిపోయారు. బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ తగలడంతో తమ భవిష్యత్ ఏంటా అనే ఆలోచనలో పడ్డారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్‌కు సైతం ఓట్లు తగ్గగా.. బీఆర్ఎస్ పూర్తిగా చితికిల పడిపోయింది. వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల్లో ఆ పార్టీ డిపాజిట్లను సైతం కోల్పోవడం చర్చనీయాంశంగా మారింది. ఇది ముమ్మాటికీ కుమ్మక్కు రాజకీయాలకు నిదర్శనమని సొంత పార్టీ నేతలే విమర్శిస్తున్నారు.

బీఆర్ఎస్‌కు దెబ్బ

ఐదు నెలల క్రితం వరకు జిల్లాలో అప్రతిహతంగా దూసుకుపోతూ తిరుగు లేని శక్తిగా ఉన్న బీఆర్ఎస్ ఒక్కసారిగా పాతాళానికి పడిపోయింది. లోక్‌సభ ఎన్నికల్లో పూర్తిగా ప్రభావం కోల్పోయింది. పార్టీ ఉనికికే ప్రమాదం ఏర్పడింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక ఆ పార్టీకి వచ్చిన ఓట్లు చూస్తే కార్యకర్తలు ఆత్మస్థైర్యం కోల్పోక తప్పదనే చెప్పవచ్చు. ఐదు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాలుగు నియోజకవర్గాల్లో ఓటమిని చవిచూసినప్పటికీ గణనీయ ఓటు బ్యాంకును సొంతం చేసుకుంది. ఆ ఎన్నికల్లో నాలుగు నియోజకవర్గాల్లో కలిపి 3,01,010 ఓట్లు సాధించింది. తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఓట్లకు భారీగా గండి పడింది. ఏకంగా 2,17,017 ఓట్లు కోల్పోయి 63,993 ఓట్లతో సరి పెట్టుకోవాల్సి వచ్చింది. తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల్లో మరీ దారుణంగా దెబ్బతినింది. తాండూరులో 10,998 ఓట్లు రాగా, వికారాబాద్‌లో 13,886 ఓటు వచ్చాయి. దీంతో డిపాజిట్లు కోల్పోయింది. దీని బట్టి చూస్తే ఆ పార్టీ నేతలు ఎంత దారుణంగా విఫలమయ్యారో ఇట్టే అర్థమవుతుంది.

మెజారిటీ క్రాస్

- భారీ ఎత్తున బీజేపీ వైపు మళ్లిన ఓటర్లు
- కాషాయానికి కలిసొచ్చింది..

అసెంబ్లీ ఎన్నికల్లో నామమాత్రపు ఓట్లతో సరిపెట్టుకున్న బీజేపీ.. లోక్‌సభ ఎన్నికల్లో భారీగా పుంజుకుంది. క్రాస్ ఓటింగ్ ఆ పార్టీకి బాగా కలిసొచ్చింది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి దాదాపు 76,696వేల ఓట్లు తగ్గాయి. బీఆర్ఎస్‌కు నాలుగు నియోజకవర్గాల్లో 3,01,010 ఓట్లు వచ్చాయి. తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 2,17,017 ఓట్లు కోల్పోయి 63,993 ఓట్లతో సరి పెట్టుకోవాల్సి వచ్చింది. ఈ రెండు పార్టీలకు తగ్గిన ఓట్లు బీజేపీకి పడడంతో ఆ పార్టీ అభ్యర్థి భారీ విజయాన్ని నమోదు చేశారు.

నియోజకవర్గం	గత అసెంబ్లీ	పార్లమెంట్
వికారాబాద్	7,128	67,408
తాండూరు	4,087	77,555
పరిగి	16,597	73,788
కొడంగల్	3988	62,560
మొత్తం	31,800	2,81,311

ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి అదనంగా వచ్చిన ఓట్లు 2,49,511

కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు గండి

అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే జిల్లాలో లోక్‌సభ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకుకు కూడా భారీగా గండి పడింది. బీజేపీ వేవ్‌లో ఓట్లను భారీగానే కోల్పోవాల్సి వచ్చింది. ఐదు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష హోదాతో ఎన్నికలకు వెళ్లిన ఆ పార్టీ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోనూ విజయ దుందుబి మోగించింది. జిల్లాలో ఆ పార్టీకి 3,76,752 ఓట్లు వచ్చాయి. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో 3,00,056 ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కేవలం ఐదు నెలల వ్యవధిలోనే ఏకంగా 76,696 ఓట్లు కోల్పోయింది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల పరంగా చూస్తే నాలుగు నియోజకవర్గాల్లో ఓట్లు తగ్గాయి. మెజార్టీ పరంగా చూస్తే సీఎం నియోజకవర్గం కొడంగల్(పాలమూరు పార్లమెంట్ పరిధి), స్పీకర్ నియోజకవర్గం వికారాబాద్(చేవెళ్ల పార్లమెంట్ పరిధి)లో బీజేపీ కంటే ఎక్కువ ఓట్లు సాధించారు. అయితే ఈ రెండు ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమిని చవిచూశారు.

జీవన్మరణ పోరాటం

దంపతులిద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే.. వీరికి నలుగురు సంతానం. ఎలాంటి కష్టాలు లేకుండా కుటుంబం సాఫీగా సాగుతోంది. మూడు వారాల క్రితం అనుకోని సంఘటన వీరిని అంధకారంలోకి నెట్టేసింది. దంపతుల్లో భార్య సుజాత అరుదైన వ్యాధి బారిన పడి మృత్యువుతో పోరాడుతోంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు
- లక్షల్లో ఒకరికి వచ్చే టీటీపీ వ్యాధి
- 25 రోజులుగా వెంటిలేటర్‌పైనే..
- వైద్యం కోసం రూ.48 లక్షల ఖర్చు
- మరో రూ.50 లక్షల వరకు అవసరం
- ఆపన్న హస్తం కోసం ఎదురు చూపులు



వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ఉపాధ్యాయురాలు సుజాత



సుజాత

తాండూరు: తాండూరులోని ఇందిరానగర్‌కు చెందిన జాదవ్ సుజాత, రమేష్ దంపతులు. వీరికి ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు. ఉన్నత చదువులు చదువుతున్నారు. భార్య భర్తలు తాండూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గత నెల 10వ తేదీ సుజాత ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయింది. వెంటనే భర్త రమేష్ ఆమెను స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. దీంతో నగరంలోని యశోదా ఆస్పత్రికి తీసుకెళ్లారు. సుజాతను పరీక్షించిన వైద్యులు రక్త ప్రసరణకు సంబంధించిన వ్యాధి(టీటీపీ) సోకిందని గుర్తించారు. ఈ వ్యాధి లక్షల్లో ఒకరికి మాత్రమే వస్తొందని వైద్యులు తెలిపారు. ప్రతి రోజూ వైద్యం కోసం రూ.2.50 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. 25 రోజులకు దాదాపు రూ.48లక్షల వరకు ఖర్చు చేసినట్లు భర్త రమేష్ తెలిపారు. ఇందుకోసం ఉన్న ఆస్తులను విక్రయించడం తోపాటు అప్పులు చేసినట్లు తెలిపారు. యశోదా ఆస్పత్రిలో మెడిక్లెయిమ్ వర్తించదని వైద్యులు చెప్పడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. తల్లికోసం పిల్లలు తల్లడిల్లి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యం కోసం మరో రూ.50లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని, దాతలు ఆదుకోవాలని కోరుతున్నారు. మానవతావాదులు ఆర్థిక సాయం చేయాలని, ప్రభుత్వం ఆదుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. ఆర్థిక సాయం చేయాలనుకునే వారు సెల్ నంబర్లు 8341075616, 8639862139లో సంప్రదించాలని కోరుతున్నారు.

వరుణయాగం అభినందనీయం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి: వరుణయాగం నిర్వహించడం అభినందనీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెల్జాల్ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వరుణయాగం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై యాగంలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. వేద పండితుల వేద ఆశీర్వాదాలు, తీర్థ ప్రసాదములు అందజేశారు. కార్యక్రమంలో వేద పండితులు నర్సింహ శర్మ, శ్రీనివాసామూర్తి, మురళీ శర్మ, శరత్ చంద్ర శర్మ, శ్రీరామ్, బాలకుమార్, చంద్రయ్య, సంజీవ్, కృష్ణయ్య, రమేశ్, అజీజ్, మోహన్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం

- దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్

పెద్దేముల్: లోక్‌సభ ఎన్నికల తరహాలోనే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా సత్తా చాటుతామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం పెద్దేముల్‌లో బీజేపీ చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపును పురస్కరించుకొని సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి మోదీ నాయకత్వం వర్థిల్లాలని నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మూడో సారి మోదీ ప్రభుత్వం రాబోతోందని తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అఖండ విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో కేంద్రంలో ఏర్పాటయ్యే మోదీ ప్రభుత్వం యువతకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, మండల అధ్యక్షుడు హరీష్‌గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సందీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు యాదయ్య గౌడ్, రాంచెందర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ సాగర్, మండల నాయకులు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం ఇప్పిస్తాం

వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోపాల్

కొడంగల్: పట్టణంలో వరి విత్తనాలు కొనుగోలు చేసి సరైన దిగుబడి రాక నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పిస్తామని వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోపాల్ హామీ ఇచ్చారు. బుధవారం స్థానిక ఏఓ కార్యాలయంలో బాధిత రైతులతో మాట్లాడారు. వరి విత్తనాలు తయారు చేసిన కంపెనీ వారితో మాట్లాడి న్యాయం చేస్తామన్నారు. ఎకరాకు వంద బస్తాలు వస్తాయనే నమ్మకంతో విత్తనాలు కొనుగోలు చేసినట్లు రైతులు తెలిపారు. ఆశించిన స్థాయిలో దిగుబడి రాక నష్టం జరిగిందని వాపోయారు. విత్తన కంపెనీపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని జేడీఏ గోపాల్ తెలిపారు. జూన్ 15న రైతులతో మళ్లీ సమావేశం ఏర్పాటు చేసి పరిహారం ఎంత ఇవ్వాలనే విషయాన్ని నిర్ణయిస్తామని చెప్పారు. జిల్లాలో ఎవరైనా నకిలీ, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు. అనంతరం యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు రైతుల పక్షాన మాట్లాడారు. నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఏడీఏ శంకర్ రాథోడ్, ఏఓ లావణ్య తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జేడీఏ గోపాల్

పర్యావరణాన్ని కాపాడుకుందాం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

అనంతగిరి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్. సున్నం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భవిష్యత్ తరాలకు మంచి జరగాలంటే మనం తప్పకుండా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్, జడ్జిలు శ్రీకాంత్, శృతి దూతా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఖయూమ్, న్యాయవాదులు వెంకటేష్, మైపాల్‌రెడ్డి, గోపాల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో..

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్ ఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఆర్‌పీఎఫ్ కార్యాలయం, రైల్వే ఆస్పత్రి పరిసరాల్లో పండ్ల మొక్కలను నాటారు. అనంతరం రైల్వే స్టేషన్‌లో యువతి, యువకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్, రైల్వే డాక్టర్ అనూష, సోమన్‌లాల్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నం పెట్టిన ఇంటికే కన్నం

- పనిచేసే దుకాణంలోనే చోరీ
- రూ.3.16 లక్షల నగదు, పది గ్రాముల బంగారు నాణెం స్వాధీనం
- ముగ్గురు నిందితులకు రిమాండ్

ఇబ్రహీంపట్నం: అన్నం పెట్టిన ఇంటికే కన్నం వేశాడు ఓ ప్రబుద్ధుడు. తమకు ఉపాధి కల్పించిన యజమానికే సున్నం వేయాలని చూసి చివరకు కటకటాల పాలయ్యారు. పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో బుధవారం ఏసీపీ కేవీపీ రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ మారయ్య చోరీ వివరాలు వెల్లడించారు. ఇబ్రహీంపట్నంకు చెందిన వ్యాపారి నాగేశ్ మంచాల రోడ్డులో శ్రీబాలజీ కిరాణం దుకాణం నడిపిస్తున్నాడు. ఈ దుకాణంలో మండల పరిధిలోని దండుమైలారం గ్రామానికి చెందిన సి.వినయ్‌కుమార్(19), వనపర్తి జిల్లా బజ్జాపల్లి గ్రామానికి చెందిన ఎం.పవన్‌కుమార్(22) సేల్స్‌మెన్‌లుగా పనిచేస్తున్నారు. షాప్ పై పోర్షన్‌లో నివాసముండే యజమాని తన భార్య పద్మావతితో కలిసి శనివారం రాత్రి చంపాపేటలోని కుమారుడి ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో వారు దుకాణ కౌంటర్‌లో నగదు పెట్టి వెళ్లారు. గమనించిన వర్కర్లు డబ్బును తస్కరించాలనుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా ఓలిండకొండ గ్రామానికి చెందిన వడ్డె వెంకటేశ్(23) నగరంలోని బంజారాహిల్స్‌లో కూరగాయల విక్రయించి జీవిస్తున్నాడు. నేరచరిత్ర ఉన్న వెంకటేశ్‌తో పవన్‌కుమార్‌తో స్నేహం ఉంది. తమపై అనుమానం రాకుండా ఈ చోరీకి వెంకటేశ్‌తో చేయించాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు అంగీకరించిన వెంకటేశ్ అదేరాత్రి ఎకో–వ్యాన్‌లో దుకాణం వద్దకు వచ్చాడు. వెనుక వైపున్న తలుపులు పగులగొట్టి షాపులోకి దూరి కౌంటర్‌లోని రూ.3.16లక్షల నగదు, 10 గ్రాముల బంగారం నాణెంను ఎత్తుకెళ్లాడు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చిన నాగేష్ దుకాణంలో చోరీ జరిగనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రంగంలో దిగిన పోలీసులు క్లూస్ టీంను రప్పించి, సీసీ పుటేజీలను పరిశీలించారు. వర్కర్లపై అనుమానంతో వారి మొబైల్ ఫోన్ కాల్స్‌పై నిఘా ఉంచారు. చోరీ జరిగిన రోజు వెంకటేశ్‌కు ఎక్కువసార్లు ఫోన్లు చేసినట్లు నిర్ధారించారు. తమదైనశైలిలో విచారించాగా చోరీ విషయం బట్టబయలైంది. దొంగిలించిన సొమ్మును పంచుకునేందుకు రావాలని వర్కర్లతో వెంకటేశ్‌కు ఫోన్ చేయించి పట్టుకున్నారు. పోలీసుల విచారణంలో నిందితుడు 2017లో జడ్చర్ల బస్టాండ్‌లో బైక్ చోరీ చేసి జైలుకెళ్లినట్లు, 2018, 2023లో బంజారాహిల్స్ చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. బుధవారం నిందితుల వద్ద నుంచి దొంగిలించిన నగదు, బంగారు నాణేంతోపాటు వ్యాన్‌ను, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించిన సీఐ సత్యనారాయణ, ఎస్ఐ మారయ్య, కానిస్టేబుళ్లు కోటేశ్, బాబురావు, రవిలను అభినందించిన ఏసీపీ రాజు రివార్డు అందజేశారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజు

క్లుప్తంగా

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



బ్యాటరీ వీల్‌చైర్‌లను అందజేస్తున్న కమిట్‌మెంట్‌ సభ్యులు

దౌల్తాబాద్‌: మండలంలోని ఐదుగురు దివ్యాంగులకు బుధవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయం ఆవరణలో కమిట్‌మెంట్‌ సంస్థ ఆధ్వర్యంలో బ్యాటరీ వీల్‌చైర్‌లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిట్‌మెంట్‌ సంస్థ కోఆర్డినేటర్‌ దస్తప్ప మాట్లాడుతూ.. ప్రతి ఏడాది దివ్యాంగులకు ఉపకరణాలను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, నాయకులు వీరన్న, దస్తప్ప తదితరులున్నారు.

నీట్‌ విద్యార్థినికి స్పీకర్‌ అభినందన



స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌తో విద్యార్థి కుటుంబం

అనంతగిరి: వికారాబాద్‌ పట్టణానికి చెందిన పి.లెనినా నీట్‌ ఫలితాల్లో 548 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ విద్యార్థినిని బుధవారం అభినందించారు. భవిష్యత్‌లో బాగా చదివి జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ షాక్‌తో ఆస్పత్రి పాలు

పెద్దేముల్‌: విద్యుత్‌ సిబ్బందికి కరెంటు షాక్‌ తగిలి, ఆస్పత్రి పాలైన సంఘటన బుధవారం పెద్దేముల్‌ మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దేముల్‌ గ్రామానికి చెందిన హర్జిన్‌ (సీఎల్‌) వీరప్ప మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు చెట్లు ఎల్‌టీ కరెంటు లైన్‌పై పడి విద్యుత్‌ స్తంభాలు విరగడంతో బుధవారం ఉదయం గ్రామంలోని ఓ రైతు పొలానికి వీరప్ప వెళ్లారు. విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ నుంచి ఎల్‌సీ తీసుకోకుండా (మినీ విద్యుత్‌) ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద ఆన్‌ ఆఫ్‌ చేస్తుండగా ఆయనకి కరెంటు షాక్‌ తగిలింది. దీంతో శరీరం వెనుక భాగంతో పాటు చేతులకు షాక్‌ కొట్టింది. వెంటనే రైతులు తాండూరుకు తీసుకెళ్లి వైద్యం అందించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి ఆయన్ని తరలించారు. ప్రస్తుతం వీరప్ప ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని విద్యుత్‌ సిబ్బందితో పాటు పలువురు తెలిపారు. ఎల్‌సీ తీసుకోకుండా విద్యుత్‌ పనులు చేయడంతో ప్రమాదం సంభవించిందని రైతులు తెలుపుతున్నారు.

అడవి పంది దాడిలో రైతుకు గాయం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాములు

పెద్దేముల్‌: అడవి పంది దాడి చేయడంతో రైతుకు తీవ్ర గాయమైన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండల పరిధిలోని జనగాం గ్రామానికి చెందిన బోయిని రాములు ఉదయం పంట పొలానికి వెళుతున్న సమయంలో ఒంటరి అడవి పంది ఆయనపై దాడి చేసింది. దీంతో రాములు కాలుకు తీవ్ర గాయంతో పాటు శరీరంలో లోపలి గాయాలయ్యాయి. వెంటనే పక్కన ఉన్న రైతులు గమనించి వైద్యం నిమిత్తం పెద్దేముల్‌కు తరలించారు. ప్రస్తుతం చెరుకు, మొక్కజొన్న, వరి పంటలు లేక పోవడంతో అడవి పందులు ఇష్టం వచ్చినట్లు పంట పొలాల్లో తిరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు.

సమస్యల చెంత.. వారాంతపు సంత

- ఆదాయం వస్తున్నా వసతులు కరువు
- ఎక్కడ చూసినా అపరిశుభ్ర వాతావరణమే
- పట్టించుకోని అధికార యంత్రాంగం



చెత్త చెదారంతో..



చెరువును తలపిస్తున్న మార్కెట్‌ యార్డు

పరిగి: వారాంతపు సంత సమస్యలకు స్థావరంగా మారింది. పట్టణంలో మార్కెట్‌యార్డులో ప్రతి శుక్రవారం, శనివారం నిర్వహించే సంతలో అన్ని సమస్యలే దర్శనమిస్తున్నాయి. దీంతో సంతకు వచ్చిన రైతులు, ప్రజలు సతమతమవుతున్నారు. మార్కెట్‌యార్డుకు ధాన్యం, కూరగాయాలు ఇతర పనులపై వచ్చిన రైతులకు కనీస సౌకర్యాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. రూ.లక్షల్లో ఆదాయం ఉన్న సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. పరిగి, దోమ, కుల్కచర్ల, పూడూర్‌, బొంరాస్‌పేట్‌ ఆయా మండలాల నుంచి చాలా మంది రైతులు, వ్యాపారస్తులు సంతలో ధాన్యం, కూరగాయల క్రయ విక్రయాల కోసం వస్తుంటారు. దీనికి మార్కెట్‌ కమిటీకి కొంత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాక పశువుల సంతలో పశువులు కొనుగోలు చేసిన, అమ్మిన మార్కెట్‌కు డబ్బులు చెల్లించాలి.

అధికారుల చేతివాటం!

మార్కెట్‌కు చెల్లించే డబ్బుల్లో అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రతి వారం మార్కెట్‌కు వచ్చే వ్యాపారస్తులతో రుసుం బిల్లులు ఇచ్చే అధికారులు కుమ్మక్కై చిటీలు చేయకుండానే ఎంతో కొంత డబ్బులు తీసుకుని మార్కెట్‌ ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. మరోపక్క యార్డులో ఎక్కడ చూసినా దుర్గంధపు వాతావరణమే కనిపిస్తోంది. వచ్చిన ఆదాయంలో సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. నిత్యం మార్కెట్‌కు వచ్చే రైతులు కుళ్లిన కూరగాయాలు అక్కడే పడేసి వెళ్తున్నారు. దీంతో పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అధికారులు కన్నెత్తి చూడటం లేదు. దీంతో దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. మార్కెట్‌ యార్డు ఆదాయంపై దృష్టి సారించిన అధికారులు పరిశుభ్రతపై ఎందుకు ఫోకస్‌ చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



మార్కెట్‌కు వచ్చిన రైతులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. పశువుల సంతలో, కూరగాయాల మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. దీంతో మార్కెట్‌కు వచ్చిన రైతులు, వ్యాపారస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి.

– వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకుడు

రైతుల నుంచే ఆదాయం



రైతులు క్రయ విక్రయాలు చేస్తేనే మార్కెట్‌కు ఆదాయం వస్తుంది. అలాంటిది రైతులకు సౌకర్యాలు కల్పించడంలో మార్కెట్‌ యార్డు అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రతి వారం రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వీటిపై పోరాటం చేస్తాం.

– మల్లేష్‌, రైతు, మిట్టకోడూర్‌

కుక్కను తప్పించబోయి..

- నాలాలోకి దూసుకెళ్లిన కారు
- నలుగురికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం



ప్రమాదానికి గురైన కారు

తాండూరు టౌన్‌: ఎదురుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ఓ ఇన్నోవా కారు రోడ్డు పక్కనే ఉన్న నాలాలోకి దూసుకెళ్లింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులు గాయాలపాలయ్యారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున తాండూరు బస్టాండు సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కొడంగల్‌ వైపు నుంచి తాండూరు పట్టణంలోకి వస్తున్న ఇన్నోవా కారు లక్ష్మి థియేటర్‌ ఎదురుగా అదుపు తప్పి నాలా నిర్మాణం కోసం తవ్విన లోతైన గుంతలో పడిపోయింది. దీంతో కారు నుజ్జు నుజ్జు కావడంతో పాటు, అందులో ప్రయాణిస్తున్న సర్దార్‌, జుబేర్‌, సల్మాన్‌, హైమద్‌లకు గాయాలయ్యాయి. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని జేసీబీ సహాయంతో కారును బయటకు తీసి, గాయపడిన వారిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన కంటైనర్‌

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



ఇల్లును ధ్వంసం చేసిన లారీ

పరిగి: అర్ధరాత్రి రోడ్డు పక్కన ఉన్న ఇంట్లోకి ఓ లారీ దూసుకెళ్లిన సంఘటన మండల పరిధిలోని గడిసింగాపూర్‌ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌ నుంచి కొడంగల్‌ వైపు పైపుల లోడ్‌తో వెళ్తున్న లారీ మంగళవారం అర్ధరాత్రి గడిసింగాపూర్‌లో రోడ్డు పక్కన ఉన్న రవికుమార్‌కు చెందిన రేకుల కిరాణ దుకాణాన్ని పూర్తిగా ధ్వంసం చేసింది. పక్కనే ఉన్న బ్యాగరి పోషయ్య ఇంట్లోకి ఆ లారీ దూసుకెళ్లింది. వేసవి కాలం కావడంతో అందరూ బయట నిద్రించడంతో పెను ప్రమాదం తప్పింది. ఇల్లు సగభాగం మొత్తం కూలిపోగా కిరాణదుకాణం పూర్తిగా నుజ్జు నుజ్జు అయింది. దుకాణంలో ఉన్న కిరాణ సామగ్రి మొత్తం నేల మట్టం అయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్‌కుమార్‌ తెలిపారు.

పేదలను విస్మరించిన బీజేపీ



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, భాస్కర్‌

అనంతగిరి: దేశంలో ఉన్న దళితులు, గిరిజనులు, మైనార్టీలు, రైతులకు ఇచ్చిన హామీలను కొత్త ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, భాస్కర్‌ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్‌లో సీపీఎం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ.. గత 10 సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదన్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే వికారాబాద్‌ ప్రాంత ప్రజలు మనోభావాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. సీపీఎం ప్రజా ఉద్యమాలతో ప్రజలను జాగృత పరుస్తుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు పేదల కోసం ఆలోచించి పథకాలు, సంక్షేమాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకటయ్య, మైపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంపీలకు సన్మానం



ఎంపీ మల్లురవిని సత్కరిస్తున్న గుర్రం కేశవులు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్‌ ఎంపీగా విజయం సాధించిన డాక్టర్‌ మల్లు రవిని పార్టీకి చెందిన ఆమనగల్లు నాయకులు ఘనంగా సత్కరించారు. నగరంలోని ఆయన నివాసంలో మల్లు రవిని మాజీ సర్పంచ్‌ గుర్రం కేశవులు ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బికుమాండ్ల రమేశ్‌, శ్రీనునాయక్‌ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ రఘువీర్‌రెడ్డిని సత్కరించిన జక్కు అనంతరెడ్డి

రఘువీర్‌రెడ్డికి అభినందనలు

నల్గొండ పార్లమెంటు సభ్యుడిగా భారీ మెజార్టీతో విజయం సాధించిన కె.రఘువీర్‌రెడ్డిని బుధవారం ఆమనగల్లు వైస్‌ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి సత్కరించారు. నల్గొండలో ఎంపీ రఘువీర్‌రెడ్డిని కలిసిన జక్కు అనంతరెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

‘అన్నివర్గాల మద్దతు బీజేపీకే’

చేవెళ్ల: అన్నివర్గాల ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలిచారని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీ తో విజయం సాధించటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న మోదీ బీజేపీని తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో కూడా అధిక ఎంపీ సీట్లు గెలిచాయని చెప్పారు. బీజేపీ బలోపేతమవుతుందని ఈ ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయన్నారు. కేంద్రంలో మారోసారి బీజేపీ ప్రభుత్వం హ్యాట్రిక్‌ విజయంతో అధికారంలోకి రాబోతుందన్నారు. బీజేపీపై ఎన్నో అసత్య ప్రచారాలు చేసి ప్రజలను బీజేపీ నుంచి దూరం చేసేందుకు చేసిన ప్రయత్నాలను ప్రజలే తిప్పకొట్టారన్నారు. ఇక రాబోయే రోజులు బీజేపీవేనని స్థానిక సంస్థలలో కూడా రాష్ట్రంలోనే బీజేపీ పట్టు నిలుపుకుటుందని చెప్పారు. మండలంలోని కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తన వంతు కృషిని అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేలా ప్రయత్నిస్తానని చెప్పారు.

మల్లురవికి శుభాకాంక్షలు

కడ్తాల్‌: నాగర్‌కర్నూల్‌ పార్లమెంట్‌ సభ్యుడిగా ఎన్నికైన డాక్టర్‌ మల్లురవిని మండల కేంద్రానికి చెందిన పలువురు కాంగ్రెస్‌ నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్లురవికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ధారూరులో బీజేపీకి ఆధిక్యం

- తొలిసారి మండలంలో కాషాయ పార్టీ హవా



ధారూరు: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ధారూరు మండలంలో కొత్త అధ్యాయాన్ని సృష్టించింది. మండలంలో ఏ ఎన్నికల్లో బీజేపీ నిలబడిన ఆశించిన స్థాయిలో రాణించకా డీలా పడుతూ వస్తోంది. కానీ అనూహ్యంగా ఈసారి జరిగిన ఎంపీ ఎన్నికల్లో మాత్రం బీజేపీ పుంజుకుని మెజారిటీ సాధించింది. గతంలో వెయ్యి, రెండు వేల ఓట్లకు పరిమితమైన బీజేపీ ఈసారి 12 వేలకు పైగా ఓట్లు సాధించి అందరినీ విస్మయానికి గురిచేసింది. ఎప్పుడూ కాంగ్రెస్‌ పార్టీకి లీడ్‌ ఇచ్చే మండలం ఈసారి బీజేపీకి ఆధిక్యం ఇవ్వడం గమనార్హం. బీఆర్‌ఎస్‌ పార్టీలోని మెజారిటీ నాయకులు బీజేపీలో చేరడంతో ఇది సాధ్యమైందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

153 ఓట్ల లీడ్‌

మండలంలో అంతగా క్యాడర్‌ లేని బీజేపీ అత్యధిక ఓట్లు రాబట్టడం అందరిని ఆశ్చర్యపర్చింది. చేవెళ్ల ఎంపీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్‌ పార్టీ కన్నా బీజేపీ 153 ఓట్ల ఆధిక్యాన్ని సాధించింది. బీజేపీకి 12,197 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 12,044 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్‌కి కేవలం 2,183 ఓట్లు రావడం గమనార్హం. ప్రధాని నరేంద్రమోదీ ప్రభావంతో యువత బీజేపీ వైపు మొగ్గు చూపారని, కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం కొనసాగుతుందన్న నమ్మకంతో అన్ని వర్గాలు కాషాయ పార్టీ వైపు ఆసక్తి చూపారు. కాగా మే 13న జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో మండలంలో 35,593 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న జడ్జి శిల్ప

- పరిగి సివిల్‌ కోర్టు జడ్జి నాగుల శిల్ప

పరిగి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పరిగి సివిల్‌ కోర్టు జడ్జి నాగుల శిల్ప సూచించారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో ఆమె మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జీవుల మనుగడకు మొక్కలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. మొక్కలు ఉంటేనే జీవకోటి మనుగడ సాధ్యమవుతుందన్నారు. దినదినం చెట్లను నరికి వేసి వృక్ష సంపదను నాశనం చేయడం ద్వారా ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి ముందు తరాలకు బాసటగా నిలవాలన్నారు. మొక్కల ఆవశ్యకతపై ప్రజలకు తెలియజేసి వాటిని సంరక్షణ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఇబ్రహీంఖాన్‌, నర్సింహారావు, గౌస్‌పాషా, శ్రీనివాస్‌రెడ్డి, శివారెడ్డి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

మొయినాబాద్‌రూరల్‌: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని హిమాయత్‌నగర్‌ గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పరిసరాల పరిశుభ్రత, పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం అనే నినాదంతో గ్రామ పంచాయతీ వద్ద బుధవారం ప్రతిజ్ఞ చేశారు. హిమాయత్‌నగర్‌, అజీజ్‌నగర్‌, కేతిరెడ్డిపల్లి, ఆయా గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించి, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి, రంజిత్‌కుమార్‌లు మాట్లాడుతూ.. ప్రకృతి వినాశనంతో మానవుడికి ఎంతో కీడు ఉందన్నారు. మానవ మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకున్నప్పుడే భవిష్యత్‌ తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్‌ అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, కవిత, పంచాయతీ సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

తొలకరి పులకింత

- వానాకాలం సాగుకు సమాయత్తం
- పత్తి విత్తనాలు విత్తుతున్న రైతులు



మరియాపురంలో పత్తి విత్తనాలు నాటుతున్న మహిళ కూలీలు

షాబాద్‌: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రైతులు పత్తి విత్తనాలు నాటుతున్నారు. ఖరీఫ్‌ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈ ఏడాది వేసవిలో అకాల వర్షాలు పడడంతో రైతులు ముందుగానే దుక్కులు దున్నుకొని సాగుకు సిద్ధంగా ఉన్నారు. మరి కొందరు రైతులు చెరువుమట్టి, పశువులు, కోడి ఎరువు చేలకు తోలుకొని పంటల సాగుకు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా రోహిణీ కార్తెలో సోమవారం, బుధవారం వర్షం కురవడంతో రైతులు పత్తి విత్తనాలు నాటుతున్నారు. కొందరు పొడి దుక్కిలోనే పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేయగా తొలకరి వానలు కురవడంతో షాబాద్‌ మండలం మరియాపూరం, అంతారం, కుర్వగూడ, కేసారం, బోడంపహాడ్‌ గ్రామాల్లో పత్తి విత్తనాలు నాటుతున్నారు. రోహిణీ కార్తెలో విత్తనాలు నాటితే మంచి దిగుబడి వస్తుందని రైతులు సాగుబాట పట్టారు.

సాగు కాలం.. రైతన్నలు జర భద్రం

- విత్తనాలు, ఎరువుల కొనుగోలులో అప్రమత్తత అవసరం
- ప్రకటనలు చూసి మోసపోవద్దు
- గుర్తింపు పొందిన విత్తనమే మేలు



బస్తాల్లో పలు కంపెనీల పత్తి విత్తనాల ప్యాకెట్లు

షాబాద్‌: వానాకాలం సాగుకు సమయం ఆసన్నమవుతోంది. రైతులు విత్తనాలు, ఎరువులు వీలైనంత త్వరగా సమకూర్చుకోవాలి. ఇదే అదునుగా విత్తన, పురుగు మందుల ప్రచారం ఊపందుకుంది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో అన్నదాతలను ఆకర్శించేందుకు యత్నిస్తున్నారు. ఆయా కంపెనీల యాజమాన్యాలు డీలర్లకు ప్యాకేజీలు, విదేశీ టూర్లు ఆఫర్‌ చేస్తున్నాయి. పత్తి విత్తనాలకు సంబంధించిన కంపెనీలు గ్రామాల్లో కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే నకిలీ విత్తనాలు మార్కెట్లకు చేరుతున్నాయి. ఆయా కంపెనీల వలలో రైతులు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో గుర్తింపు లేని లేబుల్స్‌తో నకిలీ విత్తనాలు అంటగడుతున్నాయి. వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని.. అన్ని సరిచూసుకుని కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. విత్తన కంపెనీపై ప్రభుత్వ నిబంధన వివరాలున్నాయో లేదో గమనించాలని చెబుతున్నారు.

విత్తన కొనుగోలులో జాగ్రత్తలు

- వ్యవసాయశాఖ లైసెన్స్‌ పొందిన అధీకృత డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- బిల్లుపై విక్రయదారు పేరు, కేంద్రం, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్‌, రైతు, గ్రామం పేరు, విక్రయదారు సంతకం తేదీలు, రకం పేరు, బ్యాచ్‌ నంబర్‌, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు సరి చూసుకోవాలి. లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనవద్దు.
- విత్తన ప్యాకెట్‌, సీసా, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి.
- కొనుగోలు చేసిన సరుకును డీలర్‌ వద్దే తూకం వేయించాలి.
- కొనుగోలు బిల్లులను పంట కాలం పూర్తియ్యేంత వరకు భద్రపర్చాలి.
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారిని సంప్రదించాలి.

ఎరువుల కొనుగోలులో..

- అధీకృత డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి.
- మిషన్‌ కట్టుతో ఉన్న ఎరువుల సంచులనే కొనాలి. ఒకవేళ చేతికుట్టు ఉంటే సీసం సీల్‌ చూసుకోవాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి చేసిన సంస్థ, ఉత్పత్తిదారు పేరు ఉంటేనే కొనాలి.
- చిల్లులు పడిన, చిరిగిన ఎరువుల బస్తాలను కొనవద్దు. అన్య పదార్థాలు కలిస్తే ఆఎరువు కల్తీదిగా గుర్తించాలి.
- కొనుగోలు సమయంలో డీలర్‌ రికార్డులో రైతు విధిగా సతంకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారి సహకారంతో ఎరువులను పరీక్షలకు పంపించాలి.

పురుగు మందు కొనుగోలులో..

- వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేతల సూచనల మేరకే పురుగుల మందు కొనుగోలు చేయాలి.
- పురుగు మందు డబ్బాలపై డైమండ్‌ ఆకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులుంటాయి. అత్యంత విషపూరితమైతే ఎరుపు రంగు, విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులుంటాయి.
- పురుగు మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడరాదు.
- వాడిన డబ్బాలు , సీసాలను ధ్వంసం చేసి గోతిలో పూడ్చాలి.
- పురుగు మందుల వాడకానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు ఉపయోగించొద్దు.

మోసపోవద్దు



ప్రభుత్వం లైసన్స్‌ కలిగిన డీలర్ల వద్దనే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్న విత్తనాల రసీదు తమ వద్ద పెట్టుకోవాలి. బీటీ–3 పేరిట నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు. దళారులను ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దు.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి